అప్రమత్తంగా ఉండాలి: మంత్రి అచ్చెన్న

శ్రీకాకుళం, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. '80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. ఆకస్మిక వరదలు సంభవించే ప్రదేశాలను గుర్తించి.. ప్రజలను అప్రమత్తం చేయాలి. తీరప్రాంత ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. గ్రామాల్లో ముందస్తుగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలి' అని మంత్రి సూచించారు.

పర్యాటకాభివృద్ధికి.. ఇదే అదును

- తేలుకుంచి నుంచి తిరుగు పయనమైన విదేశీ పక్షులు
- విడిది కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని స్థానికుల విజ్ఞప్తి


తేలుకుంచిలో విదేశీ పక్షులు (ఫైల్)

ఇచ్ఛాపురం, మే 4(ఆంధ్రజ్యోతి):

పర్యాటకాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురం మండలంలోని విదేశీ విహంగ కేంద్రమైన 'తేలుకుంచి'ని కూడా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. చిత్తడి, తంపర నేలలకు తేలుకుంచి గ్రామం ప్రసిద్ధి. ఇక్కడ పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. సంతానోత్పత్తికి అనుకూలమైన వాతావరణం. అందుకే సైబీరియా, జర్మనీ, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, హంగేరి దేశాల నుంచి పక్షులు వేలాది కిలోమీటర్లు ప్రయాణించి.. ఇక్కడకు ఏటా సెప్టెంబరు, అక్టోబరులో వస్తుంటాయి. ఏడు నెలలపాటు ఇక్కడే ఉండి.. స్థానికులను కనువిందు చేస్తాయి. గుడ్లుపెట్టి సంతానోత్పత్తి చేస్తాయి. పిల్లలు కొంచెం పెద్దయ్యాక వాటితో మార్చి, ఏప్రిల్‌లో తిరుగుపయనమవుతాయి. ఈ క్రమంలో ప్రస్తుతం పక్షులు తిరుగుముఖం పడుతున్నాయి. మళ్లీ అక్టోబరులో రానున్నాయి. ఈ సమయంలో విడిది కేంద్రంలో అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

టీడీపీ ప్రభుత్వ హయాంలో తేలుకుంచిలో కొన్నిరకాల నిర్మాణాలు జరిగాయి. 2019 ఆరంభంలో తేలుకుంచిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కీలక ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో అవన్నీ బుట్టదాఖలు అయ్యాయి. పర్యాటకశాఖకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టలేదు. విదేశీ పక్షుల సంతోనాత్పత్తికి సంబంధించి ఏర్పాట్లు చేయలేదు. దీంతో గుడ్లుతోపాటు చాలా పక్షులు చెట్టు కింద నుంచి జారిపడి మృత్యువాత పడుతున్నాయి. కనీసం చెట్లకు వలలు ఏర్పాటు చేసినా కొంతవరకూ పక్షులను రక్షించవచ్చు. చుట్టుపక్కల చెరువులను అభివృద్ధి చేస్తే పక్షులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అటవీ, పర్యాటక శాఖ సంయుక్తంగా చర్యలు చేపడితే విదేశీ పక్షుల విడిది కేంద్రం అభివృద్ధి సాధించే అవకాశముంది. కాగా.. తేలుకుంచి తోపాటు తేలినీలాపురంలో పక్షుల విడిది కేంద్రాల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు.


తేలుకుంచిలో పక్షులు లేక ఖాళీగా ఉన్న చెట్లు, స్తంభాలు

● పక్షులను చూస్తే బాధేస్తోంది

విదేశీ పక్షులు వచ్చినప్పుడు చాలా ఆనందం వేస్తుంది. అవి వస్తేనే ఈ ప్రాంతంలో సమృద్ధిగా పంటలు పండుతాయని మా నమ్మకం. కానీ ఈ కేంద్రంలో పక్షులు పడే బాధలు వర్ణనాతీతం. సరైన ఏర్పాట్లు లేక చెట్లపై నుంచి జారిపడి సంతానోత్పత్తి గుడ్లు పగిలిపోతుంటాయి. పక్షులు సైతం మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో చాలా బాధేస్తోంది. ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

- పాతిర్ల రాజశేఖర్, తేలుకుంచి, ఇచ్ఛాపురం

● ప్రభుత్వం దృష్టి పెట్టాలి

పక్షుల విడిది కేంద్రంపై వైసీపీ పాలనలో కనీస స్థాయిలో పర్యవేక్షణ లేదు. అటవీశాఖ, పర్యాటకశాఖ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విదేశీ పక్షుల కేంద్రంపై దృష్టిపెట్టాలి.

-మేరుగు సూర్యనారాయణ, తేలుకుంచి, ఇచ్ఛాపురం

● ప్రతిపాదనలు పంపాం

తేలుకుంచి విదేశీ పక్షుల విడిది కేంద్రంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. అటవీ శాఖపరంగా మొక్కలు కూడా నాటి సంరక్షిస్తున్నాం. పక్షుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. శాశ్వత నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు చేశాం. త్వరలో వాటికి ప్రభుత్వం నుంచి మోక్షం కలుగుతుందని ఆశిస్తున్నాం.

- ఏ.మురళీకృష్ణం నాయుడు, అటవీరేంజ్ అధికారి, కాశీబుగ్గ

ప్రశాంతంగా నీట్

- నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- 41 మంది అభ్యర్థులు గైర్హాజరు


ట్రిపుల్ ఐటీ కేంద్రం వద్ద క్యూలో అభ్యర్థులు

ఎచ్చెర్ల/ శ్రీకాకుళం క్రైం/ గుజరాతీపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షకు 1,568 మందికిగాను 1,527మంది అభ్యర్థులు హాజరయ్యారు. 41 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ (ఎస్.ఎం.పురం)లో 720 మందికి 702 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం)లో 240 మందికి 233మంది, కేంద్రీయ విద్యాలయం (పెద్దపాడు)లో 128 మందికి 123 మంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం)లో 480 మందికి 469 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరగ్గా.. ఉదయం 11.30 నుంచి 1.30 గంటల మధ్య అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు, వాచ్‌లు, వాలెట్స్ వంటి ఇతర వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా ఉండేలా అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి విడిచిపెట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్, జామర్లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించారు. పటిష్ట భద్రత నడుమ నీట్ పరీక్ష నిర్వహించామని తెలిపారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.


పాలిటెక్నిక్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్..


బారువ బీచ్‌లో పర్యాటకుల సందడి

ముగిసిన బీచ్ ఫెస్టివల్

సోంపేట, మే 4(ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం బారువలో బీచ్‌ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు రెండు రోజులపాటు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఫుడ్‌ఫెస్టివల్‌తోపాటు వివిధ క్రీడాపోటీలతో సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. బీచ్‌ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

వసతిగృహాలకు కిట్లు


పెద్దమడి గురుకుల పాఠశాల



● మెళియాపుట్టి మండలం ముకుందపురం గ్రామానికి చెందిన **ఎస్.పవన్ కుమార్** పెద్దమడి గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదివేవాడు. ప్రభుత్వం నుంచి కాస్మెటిక్ చార్జీలు రాకపోవటంతో తల్లిండ్రులు ఇచ్చిన డబ్బులతోనే సర్దుబాటు చేసుకునేవాడు. రాష్ట్ర ప్రభుత్వం కాస్మెటిక్ చార్జీలు బదులుగా కిట్‌లు అందజేస్తామని ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



● మెళియాపుట్టి మండలం కేరాశింగి గ్రామానికి చెందిన **ఎస్.చందు** పెద్దమడి గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదివేవాడు. వసతిగృహంలో దుస్తులు ఉతకడానికి సబ్బులు లేక ఇబ్బందులు పడ్డాడు. ప్రభుత్వం కిట్లు అందజేస్తే ఇటువంటి విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

- కాస్మెటిక్స్ చార్జీలకు బదులుగా 12 వస్తువుల పంపిణీ
- రానున్న విద్యా సంవత్సరం నుంచి అమలుకు కసరత్తు
- విద్యార్థుల్లో ఆనందం

మెళియాపుట్టి, మే 4(ఆంధ్రజ్యోతి):

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు సకాలంలో కాస్మెటిక్స్ చార్జీలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాస్మెటిక్స్ చార్జీలకు బదులు ఇకపై 12 రకాల వస్తువులను విద్యార్థులకు నేరుగా అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు నెలలకోసారి ఈ కిట్లను అందజేసేలా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి గిరిజన, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో టెండర్ల ద్వారా వీటిని సరఫరా చేయనున్నారు. కాస్మెటిక్స్ చార్జీల డబ్బులను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ డబ్బులను సక్రమంగా జమ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. క్షవరంతోపాటు నూనె, సబ్బు తదితర వస్తువుల కొనుగోలుకు సంబంధించి తల్లిదండ్రులపైనే ఆధారపడుతున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక కారణాలతో కొంత మంది తల్లుల ఖాతాలో కాస్మెటిక్ నిధులు జమకావడం లేదని ఆ కమిటీ గుర్తించింది. అలాగే కొంతమందికి డబ్బులు జమయినా దూర ప్రాంతాల నుంచి ప్రతినెలా తల్లిదండ్రులు రాలేకపోవడంతో విద్యార్థులు కాస్మెటిక్స్ కొనుగోలు చేయలేకపోతున్నారని ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నేపథ్యంలో కిట్లు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 29 ఆశ్రమ పాఠశాలల్లో గతేడాది 4,270 మంది విద్యార్థులు చదివేవారు. 12 గిరిజన పోస్టుమెట్రిక్ పాఠశాలల్లో 1,529 మంది, 63 బీసీ వసతిగృహాలు, 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 6,500 మంది విద్యార్థులు ఉండేవారు. సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 20 వసతిగృహాలతోపాటు 11 పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 2,820 మంది విద్యార్థులు ఉన్నారు. గురుకుల పాఠశాలలు, సీతంపేట, పెద్దమడి గురుకుల కళాశాలల్లో వందలాది మంది విద్యనభ్యసిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో డైట్ చార్జీలను మూడు, నాలుగు తరగతుల విద్యార్థులకు రూ.1,150 చొప్పున చెల్లించేవారు. ఐదు నుంచి పదోతరగతి విద్యార్థులకు రూ.1,400 చొప్పున, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1,600 చొప్పున అందజేసేవారు. కాస్మెటిక్ చార్జీల కిందట మూడు నుంచి ఆరో తరగతి విద్యార్థులకు నెలకు రూ.125, విద్యార్థినులకు రూ.130 చొప్పున చెల్లించేవారు. ఏడు నుంచి పదోతరగతి విద్యార్థులకు రూ.150, విద్యార్థినులకు రూ.200 చొప్పున అందజేసేవారు. ఇంటర్.. ఆపై విద్యార్థులకు రూ.250 చొప్పున ఇచ్చేవారు. వైసీపీ హయాంలో వీటిని సక్రమంగా అందజేయకపోవడంతో విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం కమిటీ ప్రతిపాదనల మేరకు 12 రకాల వస్తువులను కిట్ల రూపంలో నేరుగా విద్యార్థులకు పంపిణీ చేయనుంది. కొబ్బరినూనె, టూత్ బ్రష్, పేస్ట్, టంగ్‌క్లీనర్, ఫౌడర్, సబ్బు, హెయిర్ బ్యాండ్, రబ్బరు బ్యాండ్, రిబ్బన్లు, వ్యాజిలిన్, షాంపు, డిటర్జెంట్ సబ్బు, వాషింగ్ ఫౌడర్, సర్ఫ్ తదితర వస్తువులను అందజేయనుంది. బాలురకు కిట్‌తోపాటు ప్రతినెలా క్షవరానికిగాను అదనంగా రూ.50 చొప్పున అదనంగా ఇవ్వనుంది. దీంతో వసతిగృహ విద్యార్థులకు ఊరట లభించనుంది.

పూడిలంకకు తీరనున్న కష్టాలు

- వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరుకు కలెక్టర్ అంగీకారం
- జడ్పీ తీర్మానం తర్వాత పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు, మే 4(ఆంధ్రజ్యోతి): పూడిలంక వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణానికి ఎస్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.4కోట్లు మంజూరుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అంగీకరించారు. ఈ మేరకు జిల్లాపరిషత్ తీర్మానమైన వెంటనే పనులు చేపడతామని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ఎస్.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షం కురిస్తేచాలు గ్రామం చుట్టూ ఉప్పునీరు చేరి బయట ప్రపంచంతో గ్రామస్థులకు సంబంధాలు ఉండేవికావు. మూడు నాలుగు రోజులు బయటకు రాకుండా గ్రామంలోనే ఉండిపోయిన సందర్భాలు అనేకం. దీంతో అధికారులు, నాయకులు సైతం ఆందోళన చెందేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014 - 2019 మధ్య) అప్పటి పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంకకు గ్రావెల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారు. చాలా వరకు నిర్మాణ పనులు చేపట్టారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చి.. విస్మరించింది. గతేడాది ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష.. కూటమి అధికారంలోకి వస్తే వంతెన నిర్మాణ పనులు చేపడతామని పూడిలంక (మిగతా 8వ పేజీలో..)


ఉప్పుటేరు ఉధృతికి కొట్టుకుపోయిన పూడిలంక నడకదారి(ఫైల్)

ఉసురు తీసిన వివాహేతర సంబంధం 8లో
'ఉపాధి' నిధులతో రోడ్లకు మోక్షం ● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు 8లో
అరసవల్లికి పోటెత్తిన భక్తులు ● 10 గంటలకే ప్రసాదం లేదు 7లో

పకడ్బందీగా.. నీట్

- క్షుణ్ణంగా అభ్యర్థుల తనిఖీ
- గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతి


జడను సరిచేస్తూ.. కాళ్ల తాడు, చెవి దిద్దులు తొలగిస్తూ..


హాల్ టికెట్లు పరిశీస్తున్న మహిళా పోలీసు




గుర్తింపు కార్డు తీసుకురాకపోవడంతో కన్నీళ్లు పెట్టుకుంటున్న అభ్యర్థి

గుజరాతీపేట. మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం జరిగిన నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్ఎం పురం ట్రిపుల్ ఐటి, మునసబుపేటలోని కేంద్రీయ విద్యాలయాల్లో పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులను అనువనువూ తనిఖీ చేసి పరీక్ష కేంద్రాలోకి పంపించారు. చేతి గడియారం, చెవి దిద్దులు, ముక్కు పుడకలు, ఉంగరం వంటి ఆభరణాలను తొలగించారు. చేతికి, కాళ్లకు ఉన్న తాళ్లను కూడా తీసేశారు. హాల్ టిక్కెట్, ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఫొటోతో మాత్రమే లోపలికి విడిచిపెట్టారు. తర్వాత చెకింగ్, రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక హోలోగ్రామ్ స్టిక్కర్ అతికించి ప్రవేశాలు కల్పించారు. కొందరు అభ్యర్థులు చివరి క్షణంలో రావడం, అందులో గుర్తింపు పొందిన ఆధార్ కార్డును తీసుకురాకపోవడంతో ఇబ్బందిపడ్డారు.

శ్రీకూర్మం క్షేత్రానికి భక్తుల తాకిడి


స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు

గార, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని క్షేత్రంలో ఆదివారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా శ్వేత పుష్కరిణి స్వామివారిని దర్శించుకున్నారు. లక్ష్మీతాయారు సన్నిధి, తాబేళ్ల పార్కులను దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో కె.నరసింహనాయుడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): బాలకృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రాధాకృష్ణ మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మూడో రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దర్గాలో చందనోత్సవం


ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి): నగరంలో చౌకబజార్లో హజరత్ సయ్యద్ రోషన్ షావలి బాబా రహమతుల్లా షరీఫ్ సంఘ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా సమాదికి గంధం పూసి, పూలదండలతో అలంకరించి ప్రత్యేకంగా ఖురాన్ పఠనం చేపట్టారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. షేక్ సలీం సోదరులు చందనోత్సవం నిర్వహించారు. లంగర్ (విందు) కార్యక్రమాన్ని నిర్వహించారు. జామియా మసీదు ప్రతినిధులు షాన్, రఫీ, బాషా, అహమ్మద్, నజీరుద్దీన్, వహబ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు భగీరథుడు


నివాళులర్పిస్తున్న డీఎస్పీ

శ్రీకాకుళం క్రైం, మే 4(ఆంధ్రజ్యోతి): గంగను భువిపైకి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. భగీరథ మహర్షి జయంతి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐ పైడపునాయుడు, ఆర్ఐ కె.నర్సింగరావు, పోలీసు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలుగా..

జి.సిగడాం, మే 4(ఆంధ్రజ్యోతి): పెంట, గెడ్డకంచరాం ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ రెండు పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని గతంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లగా.. వారి సహకారంతో అప్‌గ్రేడ్ అయ్యాయని ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. పెంట, గెడ్డకంచరాం పాఠశాలలు ఉన్నత పాఠశాలుగా మార్పు చేసేందుకు దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయన్నారు. కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో మార్పు చేపడతామన్నారు.

టీడీపీలో కార్యకర్తకు తగిన గుర్తింపు


సూర్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, మే 4(ఆంధ్రజ్యోతి): ఏ రాజకీయ పార్టీలో లేని విధానం టీడీపీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన శివ్వాల సూర్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పైడి వరహానరసింహ ఆధ్వర్యంలో శివ్వాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తంగి గురయ్య, తమ్మినేని అమర్నాథ్, అంబళ్ల రాంబాబు, లావేటి పూర్ణారావు, మీసాల రామారావు, కందుల వెంకటరావు, కదిరి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గుత్తావల్లి రోడ్డు అభివృద్ధికి నిధులు

ఆమదాలవలస, మే 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బూర్జ మండలం గుత్తావల్లి బీటీ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనట్టు స్థానిక టీడీపీ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎస్‌పి రోడ్డు నుంచి వయా నారాయణపురం మీదుగా గుత్తావల్లి బీటీ రహదారికి రూ.2.80 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ఈ రహదారి అభివృద్ధికి నిధులు అడిగిన వెంటనే మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆర్అండ్‌బీ మంత్రి జనార్దనరెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కలప అక్రమ రవాణా అరికట్టేదెవరు?


టేకు దుంగలతో వెళ్తున్న వ్యాన్

సరుబుజ్జిలి, మే 4(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో ప్రతి రోజూ చీకటిపడితే యథేచ్ఛగా కలప అక్రమ రవాణా వాహనాలు బారులు తీరుతున్నాయి. ముఖ్యంగా గత కొంతకాలం నుంచి అటవీశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఆదివారం రాత్రి సరుబుజ్జిలి జంక్షన్ సమీపంలో ఓ వ్యాన్‌లో టేకు కలప లోడును పరదాలు కప్పి రవాణా చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో టేకు తోటలు కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారు.

నవధాన్యాల విత్తన కిట్లు సిద్ధం

ఆమదాలవలస, మే 4(ఆంధ్రజ్యోతి): చేపేనపేట యూనిట్‌లో నవధాన్యాల విత్తనాల కిట్స్‌ను సిద్ధంగా ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ సీఈఎఫ్ చేపేన సురేష్ తెలిపారు. ఆదివారం ఆయన చేపేనపేట యూనిట్‌లో మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చేపేనపేట యూనిట్‌లో నవధాన్య విత్తన కిట్లను తయారు చేసినట్టు తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో కిట్లను తయారు చేసినట్టు తెలిపారు. ఈ సీజన్‌లో నవధాన్య విత్తన సాగు ప్రతి రైతుతో కూడా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

అరసవల్లికి పోటెత్తిన భక్తులు


ఇంద్రపుష్కరిణి వద్ద భక్తుల సందడి

కౌంటర్‌లో ప్రసాదాలు లేక ఖాళీగా ఉన్న ట్రేలు

అరసవల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వైశాఖమాసం, ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఉదయాన్నే ఆలయానికి చేరుకుని స్వామివారి ఇంద్రపుష్కరిణి వద్ద క్షీరాన్నం వండి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం నూతన ఈవోగా విధుల్లో చేరిన శోభారాణి స్వయంగా పరిశీలించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి రూ.10,38,252 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.7,36,000, విరాళాల ద్వారా రూ.98,252, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,04,000 లభించాయి.

10 గంటలకే ప్రసాదం లేదు..

స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాదం లేకపోవడంతో మండిపడ్డారు. ఉదయం 10 గంటలకే లడ్డూ ప్రసాదం అయిపోవడంపై కౌంటర్‌లో ఉన్నవారిని ప్రశ్నించారు. మధ్యాహ్నం నుంచి కొంతమంది భక్తులకు ప్రసాదం టోకెన్లు ఇవ్వకుండానే డబ్బులు తీసుకుని నేరుగా ప్రసాదాలు ఇస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పులిహోర ప్రసాదానికి కూడా కాసేపు భక్తులు ఎదురుచూడాల్సి వచ్చింది. దీనిపై ఆలయ అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యం


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

జి.సిగడాం, మే 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం బాతువ, పున్నాం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. టీడీపీ సభ్యత్వ నమోదులో ఎచ్చెర్ల నియోజకవర్గం 38వ స్థానంలో నిలిచేలా కృషి చేసిన కార్యకర్తలను ముఖ్యమంత్రి అభినందించడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు కుమరాపు రవికుమార్, కూనుబిల్లి కూర్మారావు, టంకాల మౌలీశ్వరరావు, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


బాతువలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, మే 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ఎన్డీఏ కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. ఆదివారం బాతువలో పర్యటించిన ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. కూటమి ఏర్పడి అనతి కాలంలోనే గ్రామాల అభివృద్ధి బాటలో పరుగులు తీస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచనలతో రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుందన్నారు. పేదలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నారన్నారు. నాయకులు కుమరాపు రవికుమార్, ముప్పిడి సురేష్, డబ్బాడ ఆదినారాయణ, కూనుబిల్లి కూర్మారావు, నక్క మురళి, బాలబొమ్మ వెంకటేశ్వరావు, టంకాల మౌలిశ్వరరావు, మజ్జి కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

చిట్టివాని చెరువు రింగురోడ్డుకు శంకుస్థాపన

ఆమదాలవలస, మే 4(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని ఆరో వార్డు సప్తపురాలు పరిధిలోని నాదనపురం గ్రామం వద్ద ఉన్న చిట్టివానిచెరువు చుట్టూ రింగు రోడ్డుకు టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ.. నాదనపురం గ్రామానికి చెందిని పాతిన వెంకటరమణ తన సొంత ఖర్చుతో చిట్టివాని చెరువును అభివృద్ధి చేసి చుట్టూ రింగు రోడ్డు నిర్మించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణను రాజు గ్రామస్థులు, టీడీపీ నాయకులు అభినందించారు. అనంతరం పాతిన వెంకటరమణ మాట్లాడుతూ.. చిట్టివానిచెరువు విస్తీర్ణం గతంలో ఏడు ఎకరాలు ఉండేదని, ఆక్రమణలకు గురై నాలుగు ఎకరాలుగా మిగిలిందని, అధికారులు స్పందించి ఈ ఆక్రమణలు తొలగించాలని కోరారు. క్యాక్రమంలో సింగుపురం నీటి సంఘం అధ్యక్షుడు పొదిలాపు రాజారావు, కమిటీ సభ్యులు పేడాడ రాజగోపాలరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

అరసవల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కోరాడ రమేష్ సంస్థ అంజయ్య మిక్చర్స్ ద్వారా ప్రోత్సాహకం అందించడం అభినందనీయమని రాష్ట్ర జంగమ సేవా సంఘ నాయకుడు విభూది సూరిబాబు అన్నారు. ఆదివారం నగరంలోని 31వ డివిజన్‌కు చెందిన పదవ తరగతిలో 581 మార్కులు సాధించిన నవ్యశ్రీకి ఆయన పోత్సాహకం అందజేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, సమాజానికి, తల్లిదండ్రులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

నేడు ఉద్దానం ప్రాజెక్ట్ ద్వారా వంశధార జలాలు

ఇచ్ఛాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీ 23వార్డుల ప్రజలు దాహార్తి తీర్చేందుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేపట్టిన ప్రయత్నం ఫలించింది. ఎట్టకేలకు మున్సిపాల్టీకి సోమవారం నుంచి ఉద్దానం నీటి ప్రాజెక్ట్ ద్వారా వంశధార జలాలు రానున్నాయి. ఇచ్ఛాపురం చేరిన వంశధార జలాలను ప్రభుత్వ విప్ ప్రారంభించి, ప్రజలకు అందించనున్నారు. కేంద్రమంత్రి, ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మున్సిపల్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ఇంజనీరింగ్ అధికారుల ఆలోచనలతో యుద్ధప్రాతిపదికన ఉద్దానం పైపు లైన్‌కు మున్సిపల్ పైప్ లైన్ల జత చేశారు. ప్రస్తుతం వంశాధార జలాలు సంతపేట వద్ద ఉన్న పంప్ హౌస్‌కు చేరుతున్నాయి. దీంతో సోమవారం నుంచి మున్సిపల్ ప్రజలకు తాగునీటిని అందించనున్నారు.

శ్రీరామనామ దశకోటి మహాయజ్ఞం ప్రారంభం


పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ఉపనిష్మందిరం ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో శ్రీరామనామ దశకోటి మహాయజ్ఞం, హనుమాన్ చాలీసా కోటి పారాయణం, మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ఆధ్యాత్మిక రామాయణం నిర్వహించారు. వీటితోపాట గాయత్రి శ్రీరామ శ్రీహనుమాన్ మూల మంత్ర జపం, అగ్ని ప్రతిష్టాపన, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఘనంగా శ్రీ సీతారామ కల్యాణం చేశారు. అనంతరం సంగీత విభావరి నిర్వహించారు. శాస్త్రీయ భక్తి గీతాలు, దూసి కనమకమహాలక్ష్మి బృందంచే భక్తిగాన సుధాలహరి కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత చిదంబర శాస్త్రి, సిగ్మా రీసెర్చ్ సీఈవో ఆధ్యాత్మికవేత్త ఉలిమిరి వెంకట సోమయాజుల ఆధ్వర్యంలో అనుహభాషణ నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కరభట్ల శ్రీరామశర్మ, నీరజా సుబ్రహ్మణ్యం, పీవీ రమణమూర్తి, విశ్వనాథం కామేశ్వరరావు, కనుగుల సత్యం, బండారు వెంకటలక్ష్మి, నేరెళ్ల వియజలక్ష్మి, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కంచమ్మతల్లి సంబరాలకు శుభరాట


శుభరాట కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కంచిలి, మే 4(ఆంధ్రజ్యోతి): కంచిలి గ్రామ దేవత కంచమ్మ తల్లి సంబరాల మహోత్సవానికి ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం శుభ రాట వేశారు. పదేళ్లకు ఒకసారి జరిగే ఈ సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయ దత్తత గ్రామాలకు చెందిన మహిళలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని, శుభరాట వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ గాజులు, పసుపు, కుంకుమలతో వాయినాలు ఇచ్చారు.

ఖేలో ఇండియా బీచ్ పోటీలకు ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 4(ఆంధ్రజ్యోతి): దేశంలో మొదటి సారిగా నిర్వహించనున్న ఖేలో ఇండియా బీచ్ గేమ్స్‌లో పాల్గొనే రాష్ట్ర జట్లకు ఈ నెల 6వ తేదీన ఎంపికలను విజయవాడలోగల కృష్ణానది, కర్నూలులోగల తుంగభద్ర నది వేదికగా నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలియజేశారు. పురుషులకు బీచ్ కబడ్డీ, మహిళలకు బీచ్ వాలీబాల్, బీచ్ ఫుట్‌బాల్ ఎంపికలు కృష్ణానదిలో, అలాగే పురుషులకు, మహిళలకు సపక్ తక్రా ఎంపికలు కర్నూలు లో గల తుంగభద్ర నదిలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు జిల్లాల నుంచి అక్కడకు చేరుకోవాలని, ఆధార్ కోర్డు, జనన, నివాస ధ్రువ పత్రాలతో హాజరు కావాలని స్పష్టం చేశారు.

ఘనంగా తెరవే కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) నెలవారీ సాహితీ సమ్మేళనం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ బారువ కోమలరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో 13 మంది కవులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు.

కుక్కలదాడిలో దూడ మృతి

పొందూరు, మే 4(ఆంధ్రజ్యోతి): తండ్యాం గ్రామంలో ఆదివారం కుక్కలదాడిలో లంకలపల్లి వెంకటరావుకు చెందిన ఆవుదూడ మృతిచెందింది. ఆదివారం ఉదయం బయటకు వెళ్లిన దూడపై గ్రామ సమీపంలో కుక్కలు దాడిచేశాయి. దూడమెడ, నడుము, పొట్ట భాగాలపై దాడి చేయడంతో ప్రేగులు బయటకు వచ్చేశాయి. పొందూరు పశుసంవర్ధకశాఖ ఏడీకి సమాచారం ఇవ్వడంతో వైద్యులు వచ్చి చికిత్స చేసినా ఫలితం లేకుండాపోయింది. దీని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుంది.

13న మండల పరిషత్ సమావేశం

గార, మే 4(ఆంధ్రజ్యోతి): గార మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు అందరూ పూర్తి సమాచారంతో ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కార్మిక హక్కులు కాలరాయొద్దు

అరసవల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాయొద్దని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 20న కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్మిక, ప్రజా సంఘాలతో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమావేశం జరిగింది. వివిధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి వేసిందన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి, యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచడమే ఈ లేబర్ కోడ్ల లక్ష్యమని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ చిక్కాల గోవిందరావు, నాయకులు ఎస్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు రెట్టింపు రాయితీ

శ్రీకాకుళం రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉద్యానవన పంటలకు రెట్టింపు రాయితీని ప్రభుత్వం అందిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రత్నాల వరప్రసాద్ అన్నారు. వీటిపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల విస్తరణకు 5,678 హెక్టార్లకు రూ.2.62 కోట్లను కేటాయించిందన్నారు. ముఖ్యంగా డ్రాగన్ ఫ్రూట్ పంటకు రాయితీని హెక్టారుకు రూ.30వేల నుంచి రూ.1,62,000 పెంచిందన్నారు.

ఘనంగా గ్రామదేవత పండగలు

రణస్థలం, మే 4(ఆంధ్రజ్యోతి): రణస్థలం గ్రామంలో సర్పంచ్ పిన్నింటి భానూజీనాయుడు ఆధ్వర్యంలో గ్రామ దేవత పండగలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. కొత్తమ్మతల్లికి ఆదివారం పసుపు కుంకాలతో మొక్కులు చెల్లించారు. సోమవారం నీలమ్మతల్లికి, మంగళవారం పైడితల్లి అమ్మవారికి మొక్కులు చెల్లించనున్నారు. మూడు రోజుల పాటు ఈ వేడుకల జరగనున్నాయి.


కొత్తమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

అ'పూర్వ' కలయిక



అమదాలవలస: అక్కులపేట జడ్పీ ఉన్నత పాఠశాల నాటి ఉపాధ్యాయులతో 1985-86 పదో తరగతి విద్యార్థులు

వివిధ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచి ఒకరికొకరు పరిచయం చేసుకుని నాటి జ్ఞాప కాలను నెమరు వేసుకుని ఆనందం పొందారు. నాటి ఉపాధ్యాయులు, అధ్యాప కులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పాతపట్నం: నాటి ఉపాధ్యాయులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1993-94 పదో తరగతి విద్యార్థులు



గార: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో పదో తరగతి పూర్వ విద్యార్థులు



ఇచ్ఛాపురం: ఈదుపురం జడ్పీ పాఠశాలలో నాటి ఉపాధ్యాయులతో 2010-11 బ్యాచ్ విద్యార్థులు

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

- పురుగుమందు తాగి ప్రియుడి ఆత్మహత్య
- విషయం తెలిసి భయంతో ఉరేసుకున్న వివాహిత
- రెండు కుటుంబాల్లో విషాదం

ఎచ్చెర్ల, మే 4(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. తొలుత ప్రియుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, ఈ విష యం తెలిసి భయంతో ప్రియు రాలు కూడా ఉరేసుకుని ప్రాణా లు తీసుకుంది. ఈ ఘటన ఎచ్చె ర్ల మండలంలో చోటు చేసుకుం ది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం చిన్నయ్యపేట గ్రామానికి చెందిన జీరు మంగమ్మ(32)కు ఎచ్చెర్ల మండలం కొయ్యాం పంచాయతీ పాతకుర్మినాయుడుపేటకు చెందిన వ్యక్తితో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలిద్దరూ కాకి నాడలో తమ అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. అదే విధంగా లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన కొయ్యాన లోకేష్ (25) అనే యువకుడి తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో ఎచ్చెర్ల మండలం పాత కుర్మి నాయుడుపేటకు చెందిన తన తాతయ్య ఇంట్లో ఉంటూ భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో లోకేష్, మంగ మ్మ మధ్య పరిచయం ఏర్పడి.. అదికాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసిం ది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి లోకేష్ మద్యం తాగి మంగమ్మకు ఫోన్ చేసి గ్రామ సమీపంలోని ఓ తోట వద్దకు రమ్మన్నాడు. ఇందుకు ఆమె నిరాక రించింది. తాను చెప్పినట్టు రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ లో బెదిరించాడు. అయినా ఆమె రానని చెప్పి ఫోన్ స్విచ్ఆఫ్ చేసింది. దీంతో లోకేష్ విచక్షణ కోల్పోయి తన ఇంట్లో ఉన్న పురుగు మందును తీసు కుని సమీపంలోని తోటలోకి వెళ్లి తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉద యం అటు వైపు వెళ్లిన గ్రామస్థులు లోకేష్ మృతదేహాన్ని గమనించి కు టుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు లోకేష్ తాతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, లోకేష్ తనతో ఫోన్‌లో మాట్లాడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం, తన కాల్ డేటాను పరిశీలిస్తే అందరికీ తెలుస్తుందనే భయంతో మంగమ్మ ఆదివారం ఉదయం 7.30 గంటల సమ యంలో తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో శవపంచనామా నిర్వ హించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసు పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది.

చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడి మృతి



సింహాచలం (ఫైల్)

ఎచ్చెర్ల/రణస్థలం, మే 4(ఆంధ్రజ్యోతి): జరజాం జంక్షన్ జాతీయ రహదారిపై శనివారం సాయం త్రం జరిగిన ప్రమాదంలో గాయపడిన రణస్థలం మండలం వేల్పురాయి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బాలి సింహాచలం(65) శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సింహాచ లం, అదే గ్రామానికి చెందిన అడపా శ్రీనుతో కలిసి శ్రీకాకుళం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శ్రీను మృతి చెందగా, సింహాచలం చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సింహాచలానికి భార్య కాంతారత్నం, కుమారులు ఉన్నారు. కాగా కాంతారత్నం గతంలో ఎంపీటీసీగా సేవలందించారు. ఒకే ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

రణస్థలం, మే 4(ఆంధ్రజ్యోతి): కోటపాలెం గ్రామానికి సమీపంలోని తోట లో ఆదివారం కోడి పందేలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేర కు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వ హించారు. ఈ దాడిలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. వారి నుంచి స్కూటీ, ఒక కోడి, రూ.2000 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆయువు తీసిన అనుమానం

- భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య
- హైదరాబాద్ సుభాష్‌నగర్‌లో ఘటన
- మృతురాలు వజ్రపుకొత్తూరు వాసి



లక్ష్మి (ఫైల్)

జీడిమెట్ల, మే 4(ఆంధ్రజ్యోతి): భర్త అనుమా నంతో వేధింపులకు గురి చేస్తుండడంతో మన స్తాపం చెందిన భార్య ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హైదరాబాద్ సుభాష్‌నగర్‌లోని ఓ అపార్టుమెం ట్‌లో ఆదివారం జరిగింది. శ్రీకాకుళం జిల్లా వజ్ర పుకొత్తూరు గ్రామానికి చెందిన లక్ష్మి అలియాస్ పూజ (25)కు అదే జిల్లా సోంపేటకు చెందిన హరికృష్ణతో గత సంవత్సరం డిసెంబర్ 14న వివా హం జరిగింది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో హరి కృష్ణ పనిచేస్తున్నాడు. వీరు ఫిబ్రవరి నుంచి సుభాష్‌నగర్ గణేష్ గ్రౌండ్ సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్నారు. డిగ్రీ వరకు చదువు కున్న లక్ష్మి తన మేన బావను ప్రేమించింది. అతనిని పెళ్లి చేసుకోవాలని భావించింది. అయితే రెండు కుటుంబాల మధ్య వైరం ఉండటంతో వీరి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. ఆమె తల్లిదండ్రులు అకౌంటెంట్‌గా పని చేస్తున్న హరికృష్ణతో వివాహం జరిపించారు. లక్ష్మి తన బావను ప్రేమించిన విషయం హరికృష్ణకు తెలియడంతో పెళ్లి అయినప్పటి నుంచి అనుమానంతో ఆమెను వేధింపులకు గురిచేస్తుండేవాడు. భర్త పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు, పెద్దలు సర్దిచెప్పి తిరిగి కాపు రానికి పంపించారు. తోడుగా లక్ష్మి తమ్ముడిని కూడా వీరితో పాటు పంపా రు. అయినా వేధింపులు ఆగలేదు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో లక్ష్మి ఐదంతస్తుల భవనంపై నుంచి కింద పడి మృతి చెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, లక్ష్మి మృతికి సంబం ధించి ఆమె భర్త పాత్రపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. మృతురాలి తల్లిదండ్రులు వచ్చిన తర్వాత వారిచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై..



మృతిచెందిన వి.నూకరాజు

పలాస, మే 4(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్ వద్ద పాత జాతీయ రహ దారిపై ఆదివారం ఉదయం మద్యం సేవించి ఊన నూక రాజు అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. తొలుత గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశా రు. అనంతరం ఆయనకు చెందిన ఫొటోలు సోషల్ మీడియాలో పెట్టడంతో మృతుడు నూకరాజుగా గుర్తించారు. కాశీ బుగ్గలో కొద్ది రోజుల కిందట చిన్నవ్యాపారం చేసుకున్న ఈయన మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రెండురోజులుగా తప్పతాగి రోడ్డు పక్కన ఉన్న ఖాళీ షాపు వద్ద నిద్రిస్తూ అక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ చంద్రరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'ఉపాధి' నిధులతో రోడ్లకు మోక్షం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

పోలాకి, మే 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లోని రహదారులను కూటమి ప్రభుత్వం సీసీ రోడ్లుగా మార్పు చేసిం దని కేంద్ర మం త్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం దీర్ఘాశి దుర్గా గిరి అమ్మవారి ఆలయం వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తాయని, వివాదా లు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. గతంలో పలు రోడ్లు దారుణంగా ఉండేవని కూటమి ప్రభుత్వం వచిచన తరువాత నిధులు మంజూరు చేసి రోడ్ల నిర్మాణం చేపడుతోందన్నారు. అంతకు ముందు గ్రామంలోని దుర్గాగిరి అమ్మవారి జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రోణంకి కృష్ణంనాయుడు, మిరియ బిల్లి వెంకట అప్పలనాయుడు, పల్లి సూరిబాబు, చిట్టి సింహాచం, తర్ర లక్ష్మీనారాయణ, సూరపు నారాయణ దాస్, సర్పంచ్ మెండ కృష్ణసుమంగళి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు కేంద్రమంత్రికి ఆహ్వానం

నరసన్నపేట, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 7 నుంచి జరగనున్న నేపథ్యంలో ఉత్సవాలకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆహ్వాన పత్రికను అందించారు. పది రోజల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పొట్నూరు చిన్న వీరభద్రస్వామి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, మావుదూరి జగదీశ్వరబాబు, పొట్నూరు కృష్ణప్రసాద్, జగన్నాథశర్మ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే బగ్గు

మాల ఉద్యోగ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా 'చల్లా'



సమావేశంలో పాల్గొన్న మాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

టెక్కలి, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా రామారావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మాలలకు అన్యాయం చేస్తోందన్నారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడుతూ.. జనాభా లెక్కలు లేకుండా, ఎంపికల డేటా లేకుండా సుప్రీంకోర్టు కేవలం ఉప వర్గీకరణ చేయమంటే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా వర్గీకరణ చేసి మాలలకు అన్యా యం చేసిందన్నారు. 59 ఉప కులాల్లో వెనుకబడి వారిని అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పిం చాలే తప్ప దళితుల మధ్య విభజన వాదం సరైనది కాదన్నారు. పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి షిర్డీసాయి మందిరం ప్రారంభం



నందిగాం, మే 4(ఆంధ్రజ్యోతి): దిమ్మిడిజోలలో మంగళవారం నుంచి షిర్డీసాయిబాబా ధ్యానమందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త సలాన వెంకట్రావు మాస్టారు ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా హోమాల నిర్వహణకు యాగశాల నిర్మాణం చేపట్టారు. కాపు తెంబూరు దత్తాశ్రమ పీఠాధిపతి నిర్వీ శ్యానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలిన యువత

వజ్రపుకొత్తూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు తీరంలో సంరక్షించిన తాబేళ్ల పిల్లలను ఆదివారం స్థానిక యువత సముద్రంలోకి విడిచిపెట్టారు. సుమారు 1000 పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టినట్లు వారు తెలిపారు.



నీలమణిదుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాతపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణిదుర్గ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ 50వ వార్షిక యాత్రా మహోత్సవాల్లో భాగంగా లలిత అష్టోత్తర శతనామార్చన, శ్రీ సూర్య, దుర్గా సూక్ష్మహోమాలు, మహారాజభోగాలు నిర్వ హించారు. వివి ధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలిచ్చి ముడ్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంజీఆర్



చింతలపోలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): తెంబూరు గ్రామంలో చింతలపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నిర్వ హించారు. తెంబూరుతో పాటు పరిసర గ్రామాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మ వారిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వహణకు రూ.25 వేల నగదును నిర్వాహకులకు అందజేశారు. కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

ముగిసిన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పోలాకి, మే 4(ఆంధ్రజ్యోతి): కాకినాడపేట రామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ తత్సన్యాస, రత్న, ధాతు, బీజన్యాస, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, దర్పణ దర్శనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో తిర్లంగి విశ్వనాథం, లావేటి కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ



పంచలోహ విగ్రహాలను తీసుకువెళుతున్న కలమట రమణ

కొత్తూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మాతల గ్రామంలో త్రినాథ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల మట సొంత గ్రామంలోని ఆలయంలో పంచలోహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్ర మం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అంబావల్లిలో...



త్రినాథ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

హిరమండలం, మే 4(ఆంధ్రజ్యోతి): వైశాఖ మాసం సందర్భంగా అంబావల్లి గ్రామంలోని త్రినాథస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా వైశాఖ మాసంలో వచ్చే నాలుగు ఆదివారాలు ఉత్సవాలను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు.

మరుగుదొడ్లు పూర్తయ్యేదెప్పుడో?

- దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న వైనం



అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

పాతపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): కొరసవాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థినీ, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 250 మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. వైసీపీ హయాంలో రూ. 69 లక్షలు నిధులు మంజూరు కాగా మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించారు. సుమారు రూ. 35 లక్షల వరకు వినియోగించి పనులు చేపట్టారు. అయితే పనులను మధ్యలోనే వదిలి వేయడంతో దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అసంపూర్తి పనులతో 'నాడు-నేడు' లక్ష్యానికి తూట్లు పడుతున్నా యన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనేక పర్యాయాలు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఫలితం కనిపించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వెల్‌నెస్ సెంటర్..

వైసీపీ హయాంలో చేపట్టిన నీది పంచాయతీలో వెల్‌నెస్ సెంటర్ కూడా అసంపూర్తిగా మిగిలిపోయింది. ఉపాధి నిధులతో చేపట్టిన భవనం పనులు నేటికీ పూర్తికాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.26 లక్షల అంచనాతో 2022లో పనులు ప్రారంభించినా నేటికీ పూర్తిచేయకపోవడంతో లక్ష్యానికి తూట్లుపడుతున్నాయి. దీంతో గ్రామంలో అద్దె భవనంలో వెల్‌నెస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న వెల్‌నెస్ సెంటర్

న్యూస్ బాక్స్

రహదారిని శుభ్రం చేశారు



హిరమండలం, మే 4(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలం సుభ లయ కాలనీ పల్లెవీధిలో రోడ్డును పంచా యతీ అధికారులు శుభ్రం చేశారు. ఈ రోడ్డు దుస్థితిపై గురువారం 'ఆంధ్ర జ్యోతి'లో 'రోడ్డుపైనే మురుగునీరు' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనికి ఎంపీడీవో కాశీప్రసాద్ స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో పంచాయతీ సిబ్బంది రోడ్డును శుభ్రం చేయడంతో పాటు కాలు వలోని మురుగునీటిని బయటకు పం పించారు.

9న జాబ్ మేళా

నరసన్నపేట, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయిరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి , ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. పలు కంపెనీలు ఈ మేళాలో పాల్గొని ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

సిరిమానుకు ప్రత్యేక పూజలు

నరసన్నపేట, మే 4(ఆంధ్రజ్యోతి): మాకివలస గ్రామదేవత అసిరితల్లి సిరిమానోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సిరిమానుకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సతీమణి బగ్గు సుగుణ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్దకు దేవరను మంగళవాయిద్యాలు నడుం తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శిమ్మ పార్వతి, నేతింటి భారతి, సర్పంచ్ మోహనరావు పాల్గొన్నారు.

సిబ్బంది నియామకం

నరసన్నపేట, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ముగ్గురు కార్యాలయం సిబ్బందిని నియమిస్తూ వైద్యవిధాన పరిషత్ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆసుపత్రి ఏవో కాళీచరణ్ తెలిపారు. సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతిపై పొందూరు నుంచి పి. అనూష, డీసీహెచ్ కార్యాలయం నుంచి ప్రసన్నకుమార్, సీనియర్ ఫార్మసిస్టుగా ఆమదాలవలస సామాజిక ఆసుపత్రి నుంచి వై. ఆదిలక్ష్మిలను నియమించినట్లు తెలిపారు.

ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



నరసన్నపేట, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 84 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఆదివారం మండల రిసోర్సు కేంద్రానికి చేరాయి. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు 20,557 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు. ఐదో తరగతి మినహా మిగిలిన అన్ని తరగతులు, అన్ని సబ్జక్టులకు చెందిన పుస్తకాలు వచ్చాయన్నారు. త్వరలో పాఠశాలలకు పంపిణీ చేయనున్నామన్నారు.

పూడిలంకకు తీరనున్న కష్టాలు

(ఐదో పేజీ తరువాయి)

గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి పూడిలంక దుస్థితిని వివరించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు కూడా అనేకసార్లు పూడిలంక వంతెన నిర్మాణాలు నిధులు కేటాయించాలని కోరారు. ఇటీవల కలెక్టర్‌ను కూడా కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేశారు. దీంతో రూ.4కోట్ల నిధులు మంజూరుకు కలెక్టర్ అంగీకరించడంతో పూడిలంక వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మిస్తే ముంపు కష్టాలు తీరనున్నాయని పేర్కొంటున్నారు.